నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 7 జనవరి 2025 | MEDAK


గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సర్కార్

- రైతుల తరపున పోరాటం చేస్తాం
- హామీలు నెరవేర్చడంతో కాంగ్రెస్ పూర్తిగా విఫలం
- పంట రుణమాఫీ, నేటికీ రైతు భరోసా అందని రైతులతో కలిసి త్వరలో భారీ ర్యాలీ
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 6: రేవంత్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అబద్ధాలు, అసత్య ప్రచారాలతో ప్రజలను, రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. మూడు పంటలకు రూ.15వేల రైతు భరోసా ఇస్తామని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఎందుకు మాట మీద నిలబడడం లేదన్నారు. రైతులకు బోనస్, రూ. రెండు లక్షల రుణమాఫీ సంపూర్ణంగా చేయలేకపోయారన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు చెప్పేది ఒకటి, చేసేది మరొకటన్నారు. పొంతనలేని హామీలతో అధికారంలోని వచ్చిన తర్వాత అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్నారని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నాడు కేసీఆర్ రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రదేశపెట్టడంలో ఎంతో కృషి ఉందని, మూడు లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారన్నారు. 13నెలల కాలంలోనే రాష్ట్రంలో రూ.7వేల కోట్ల ఆదాయం తగ్గిందని, మరో మూడు నెలల్లో అది కాస్తా రూ.10వేల కోట్లకు చేరుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానాల కారణంగా రాష్ట్రం దివాలా అంచునకు చేరిందన్నారు. ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ.17, 500 బాకి పడిందని, హామీలను మరిపించేందుకే కేటీఆర్‌పై ఏసీబీ, ఈడీ కేసులు పెట్టించారని నరేంద్ర మోదీ, రేవంత్‌రెడ్డి కుమ్ముకై రాష్ట్రంలో అందరిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఇప్పుడు ఎన్నికలు పెడితే కాంగ్రెస్‌కు ఆరు సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎక్కడ కూడా పనులు ప్రారంభించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ సీజన్ ప్రారంభంలోనే కూడవెళ్లి, హల్దీ వాగుల్లో సాగునీళ్లు వదలడంతో వేలాది ఎకరాల్లో రైతులు వరి సాగు చేసుకున్నారని చెప్పారు.

అవినీతికి అడ్రస్‌గా మారిన గజ్వేల్

గజ్వేల్ అవినీతికి అడ్రస్‌గా మారిందని, ఎక్కడ చూసినా అవినీతే ఉందన్నారు. అధికారులను అడ్డం పెట్టుకొని స్థానిక కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నరని విమర్శించారు. గజ్వేల్ ప్రాంతంలో వసూళ్లకు పాల్పడిన వారి పేర్ల చిట్టాను త్వరలోనే బయటపెడుతామని ఎవ్వరిని వదిలిపెట్టబోమన్నారు. రుణమాఫీ కాని, నేటికీ రైతు భరోసా అందని రైతులతో కలిసి కోటమైసమ్మ ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వేలాది మంది రైతులతో కేసీఆర్, హరీశ్‌రావు ఆధ్వర్యంలో త్వరలోనే భారీ ర్యాలీ, సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జకీయొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు మధు, నవాజ్ మీరా, కౌన్సిలర్లు చందు, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, కనకయ్య, నాయకులు కృష్ణారెడ్డి, మల్లేశం, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, విరాసత్ అలీ, జఫర్‌ఖాన్, దేవేందర్, రమేశ్‌గౌడ్, రాజిరెడ్డి, ఎల్లయ్య, ఆర్‌కే శ్రీను, స్వామిచారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 6: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరంలో నిర్వహించిన మండలస్థాయి విద్య, సాంస్కృతిక సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్యతోపాటు సకల వసతులు ఉంటాయన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందుకు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో

ప్రజావాణికి 85 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 6: ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 85 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురీ, ఆర్డీవో రవీందర్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈవీఏం గోదాంను సందర్శించిన కలెక్టర్

బైపాస్ రోడ్డులోని పాత వెలుగు కార్యాలయ ఆవరణలోని ఈవీఏం గోదాంను ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా సందర్శించారు. సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల సామగ్రిని భద్రపర్చిన తీరును కలెక్టర్ తనిఖీ చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

'త్రికాళ' షూటింగ్ సందడి

వర్గల్, జనవరి 6: సిద్దిపేట జిల్లా వర్గల్ మండల పరిధిలోని వర్గల్‌తోపాటు మీనాజీపేట, నాచారం, అనంతగిరిపల్లి పరిసర ప్రాంతాల్లో సోమవారం త్రికాళ సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఈ సినిమాలో క్యారెక్టర్ రోల్ పోషిస్తున్న నెంటూర్ గ్రామానికి చెందిన ఎలగందుల యాదగిరి, డైరెక్టర్ వేణు, కో డైరెక్టర్ కార్తీక్, సినిమా యూనిట్ బృందం పాల్గొంది. తెలంగాణకు సంబంధించిన యాస, ప్రాచీన నాగరికత, నమ్మకాలు, పండుగల విశిష్టత, సాయుధ పోరాట సన్నివేశాలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు జరిగిన గాథలను కూడా ఈ చిత్రంలో చూపించనున్నారు. త్వరలో నిర్మించనున్న ఏడుతరాల యుద్ధం సినిమాలో కూడా అవకాశం వచ్చినట్టు నటుడు యాదగిరి తెలిపారు.

సన్నివేశం చిత్రీకరణలో త్రికాళ సినిమా డైరెక్టర్, కో డైరెక్టర్‌తో యాదగిరి

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి,

కేసీఆర్ రైతుబంధువైతే..రేవంత్ రాబందు

రైతులను అరిగోసపెడుతున్న కాంగ్రెస్ సర్కార్ • ఇక్కడ సీఎంగా ఉంటూ ఆంధ్ర పాలనను మెచ్చుకోవడం సిగ్గుచేటు

- రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం
- ఎకరానికి రూ.15 వేలు పంట పెట్టుబడి ఇచ్చే వరకు వదిలిపెట్టం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం సిగ్గుచేటు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా హబ్షీపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ధర్నా

దుబ్బాక, జనవరి 6: ఎద్దు ఏడ్చిన ఎవుసం..రైతు ఎడ్చిన రాజ్యం చరిత్రలో బాగుపడదన్నట్లుగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను కంటతడి పెట్టిస్తున్న రేవంత్ సర్కారుకు పుట్టగతులుండవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రైతుబంధువైతే ..రైతులను హరిగోస పెడుతున్న రేవంత్ సర్కారు రైతు రాబందువుగా మారడని విమర్శించారు. రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్న రైతు భరోసా ఇచ్చేంతవరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నిరసనలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. రైతులకు రైతు భరోసా కింద రావాల్సిన డబ్బుల వివరాల ఫ్లకార్డులతో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మట్లాడుతూ..రైతుల కోసం పోరాటం చేసే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని, రైతు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని పథకాలు ప్రవేశపెట్టి, రైతు బాంధవుడిగా కేసీఆర్ రైతుల గుండెల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రేవంత్ సీఎం గద్దెపై కూర్చుని రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సీఎంగా ఉంటూ సమైక్యాంధ్రా పాలనను మెచ్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను రోడ్డుకిడ్చిందని మండిపడ్డారు. అప్పుడు పండించిన పంటకు మద్దతు ధర, ఎరువులు, విత్తనాలు, రుణమాఫీ కోసం, ఇప్పుడు రైతు భరోసా కోసం రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతు భరోసా కింద రైతులకు బకాయిపడ్డ డబ్బులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ రైతులకు రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15 వేలు చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు. రైతు భరోసా అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని సూచించారు. రైతుల కోసం పోరాటం చేసేందుకు వస్తున్న తమను కాంగ్రెస్ సర్కారు పోలీసులతో హౌస్ అరెస్టు చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత రేవంత్ సర్కారులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టులు చేయిస్తుందని మండిపడ్డారు. రైతులను మోసగించిన కాంగ్రెస్ సర్కారు మెడలు వంచే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. నిరసనలో బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, కోమటిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నారాగౌడ్, భూం రెడ్డి, శ్రీనివాస్, జీడిపల్లి రవి, బండి రాజు, కమలాకర్ రెడ్డి, ప్రభాకర్, కృష్ణ, కిష్టారెడ్డి, విష్ణు, దేవరాజు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు


నర్సాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

రైతులను వంచించిన కాంగ్రెస్

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- నర్సాపూర్‌లో క్యాంప్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ

నర్సాపూర్, జనవరి 6: రైతులకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని చెప్పి, కేవలం రూ.12 వేలు మాత్రమే ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతాంగాన్ని నయవంచన చేశారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నర్సాపూర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసినందుకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా చేసి ఆరు గ్యారెంటీలకు, రైతు డిక్లరేషన్‌కు శవయాత్ర చేపట్టారు. క్యాంప్ కార్యాలయం నుంచి నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తా వరకు ఆరు గ్యారెంటీల ఫ్లెక్సీలను, రైతు డిక్లరేషన్‌కు శవయాత్ర నిర్వహించి నర్సాపూర్ చౌరస్తాలో సమాధి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని ప్రభుత్వమని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలను విస్మరించిందని ఎద్దేవా చేశారు. ప్రశ్నించే గొంతుకలైన కేటీఆర్, హరీశ్‌రావులపైన అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీమంత్రి కేటీఆర్‌ను లాయర్‌తోసహా ఈడీ కార్యాలయంలోకి రానివ్వకుండా అడ్డుకుంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను, రైతులను నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ధనిక రాష్ట్రమని చెప్పి, నేడు ఖజానా ఖాళీ అని చెప్పడం సిగ్గుచేటన్నారు. భూమిలేని వారికి రూ.12 వేలు ఇస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి, ఉపాధి హామీ కూలీలకూ వర్తింపచేయాలని డి మాండ్ చేశారు. ఆటోకార్మికులకు ఇస్తానన్న రూ.15వేలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అమలుకాని హామీలు ఇచ్చి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం కచ్చితంగా రైతుభరోసా రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని, రైతుల పక్షాన నిలబడుతుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, మాజీ ఎంపీపీ హరికృష్ణ, శివంపేట్ మండల అధ్యక్షుడు రమణా గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రా గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, షేక్ హుస్సేన్, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై నిబంధనలు పెట్టడం సిగ్గుచేటు

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా, రాస్తారోకో

హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్, జనవరి 6: రైతులను నమ్మించి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో నిబంధనలు లేకుండా, దరఖాస్తు తీసుకోకుండా రైతుబంధు వచ్చిందని, కాంగ్రెస్ హయాంలో మాత్రం రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని, రూ.రెండు లక్షల పంట రుణమాఫీ సంపూర్ణంగా చేయాలని, మహిళలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను, ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని దేవుళ్లపై ఒట్టేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట తప్పడం దారుణమన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ఉద్యమాలు ఆగవని సతీశ్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సుద్దాల చంద్రయ్య, ఎండీ అన్వర్, తిరుపతి రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, హుస్నాబాద్ పట్టణంతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 6: మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్‌ను సోమవారం ఎర్రవల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు. కేసీఆర్ పద్మాదేవేందర్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

కాల్వల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 6: దుబ్బాక నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ కెనాల్స్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కెనాల్స్‌పై ఇరిగేషన్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్, ఇతర మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాల్వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దుబ్బాక నియోజకవర్గంలో వంగిన విద్యుత్ స్తంభాలు, మరమ్మతులకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి సరిచేయాలన్నారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెలే మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలుగకుండా సాగునీరు సరఫరా చేయాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, కాళేశ్వరం ప్రాజెక్ట్ యూనిట్ 1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, ఇరిగేషన్ ఈఈ నారాయణ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన సంగీత కచేరీలో సరోద్ వాయిస్తున్న ఉస్తాద్ అంజాద్ అలీఖాన్

అత్యాచారాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి

ప్రముఖ సరోద్ విద్యాంసులు ఉస్తాద్ అంజాద్ అలీఖాన్

సంగారెడ్డి జనవరి 6 (నమస్తే తెలంగాణ): మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని ప్రముఖ సరోద్ విద్యాంసులు ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో spicmacay ఆధ్వర్యంలో ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ సంగీత కచేరీ జరిగింది. కార్యక్రమ ప్రారంభంలో అలీఖాన్ మాట్లాడుతూ..మహిళలపై అత్యాచారాలు, దాడులు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తికి మొదటి గురువు తల్లి అని పేర్కొన్నారు. తమ తల్లులను గౌరవించిన మాదిరిగానే సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళలకు తగిన గౌరవం, మర్యాదలు ఇవ్వాలని కోరారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి మరణ శిక్ష విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనటం హర్షణీయం అన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా మనదేశంలో కూడా చట్టాలు రావాల్సిన అవసరం ఉంద ని అభిప్రాయపడ్డారు. సంగీత విభావరిలో భాగం గా ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ తన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. మొదట ప్రముఖ తబలా వాయిద్యకారులు ఆదిత్య కల్యాణ్‌పురా, అమిత్ కావ్‌తేకర్ జుగల్‌బందీ అందరిని ఆకట్టుకుంది. ఆ తర్వాత ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ తన సరోద్ వాద్యం ద్వారా అందరిని కట్టి పడేశారు. మొదట గణేశ కల్యాణరాగం వినపించిన ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ ఆ తర్వాత వరుసగా రాగ్ జిలాకాఫీ, రాగ్ బహార్, రాగ్ కమజ్‌లను వినిపించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఉస్తాద్ అంజాద్ అలీఖాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ పాలకవర్గం చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.